క్లుప్తంగా

గోవిందా.. గోవిందా..



శ్రీవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. వేకువజామున సుప్రభాత, తోమాల సేవ అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వందలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కోలాటాలు, గోవింద నామ కీర్తనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

సేవాభావంతోనే నర్సింగ్ వృత్తిలో రాణింపు



మాట్లాడుతున్న డాక్టర్ గీతాంజలి

కొమ్మాది: సహనం, సేవాభావంతో నర్సింగ్ వృత్తిని చేపట్టాలని, అప్పుడే వృత్తిలో రాణించి ఉన్నత శిఖరాలను చేరుకోగలరని గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ప్రో వీసీ డాక్టర్ బి.గీతాంజలి పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి బీఎస్సీ, నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు శనివారం నర్సింగ్ వృత్తి ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాల్లో నర్సింగ్ వృత్తికి అధిక ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు.

ఆలయంలో పాము కలకలం



ఆంజనేయస్వామి ఆలయంలో పామును పట్టుకుంటున్న శ్రీనివాస్

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ సమీపంలో గల ఆంజనేయస్వామి ఆలయంలో 5 అడుగుల నాగుపాము శనివారం కలకలం రేపింది. ఇక్కడకు వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకునే సమయంలో ఒక్కసారిగా పాము రావడంతో ఆందోళనకు గురయ్యారు. వెంటనే స్నేక్ క్యాచర్ శ్రీనివాస్‌కు సమాచారం ఇచ్చారు. శ్రీనివాస్ పామును చాకచక్యంగా పట్టుకున్నారు.

వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు



8వ వార్డులో పర్యటిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

కొమ్మాది: ఇటీవల కురిసిన వర్షాలకు కాలువలు, గెడ్డల్లో నీరు నిలిచిపోతోందని, వీటిని శానిటరీ సిబ్బంది వెంటనే తొలగించాలని జెడ్సీ కనక మహాలక్ష్మి ఆదేశించారు. జీవీఎంసీ 8వ వార్డులో పలుచోట్ల కార్పొరేటర్ లొడగల అప్పారావుతో కలిసి శనివారం ఆమె పర్యటించారు. ఇక్కడ ఓ ప్రైవేటు పాఠశాల సమీపంలో మూడు రోజులుగా నిల్వ ఉన్న నీటిని తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్రపరచాలని, ఎక్కడా మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

అక్కచెల్లెమ్మలకు అండగా సీఎం జగన్

- ముఖ్యమంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసిన 'ఆసరా' లబ్ధిదారులు



టి.నగరపాలెంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సర్పంచ్ ఛాయాగౌతమి



తాళ్లవలసలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఏఎంసీ చైర్మన్ సూర్యనారాయణ, తదితరులు

తగరపువలస: రాష్ట్రంలో అక్కచెల్లెమ్మలకు అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని భీమిలి ఏఎంసీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ అన్నారు. వైఎస్సార్ ఆసరా వరుసగా మూడో ఏడాది పంపిణీ సందర్భంగా శనివారం భీమిలి మండలం తాళ్లవలసలో సీఎం జగన్ చిత్రపటానికి మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు రూ.2.25 లక్షల కోట్లు లబ్ధి చేకూర్చి వారు తలెత్తుకు తిరిగేలా చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు పొదుపు సంఘాల రుణాలు కట్టవద్దని మహిళలను మోసం చేసిన సంగతి ఎవరూ మరచిపోలేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బోని జగ్గమ్మ, బోని సన్నిబాబు, పార్టీ గ్రామ అధ్యక్షుడు అక్కరమాని అప్పలనాయుడు, నాయకులు మన్యాల రాంబాబు, అక్కరమాని రమణ, కార్యదర్శి ప్రసాద్, వీఆర్వో వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

- టి.నగరపాలెం రైతుభరోసా కేంద్రం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ పొట్నూరు ఛాయా గౌతమి ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాత్రమే మహిళలకు సంక్షేమం, సామాజిక న్యాయం, సాధికారత సాధ్యమవుతుందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పల్లా నీలిమ, బీసీ సెల్ అధ్యక్షుడు పొట్నూరు చంద్రశేఖర్, కన్వీనర్ ఇద్దిపల్లి మణి, రాజగిరి రామచంద్రరావు, పల్లా సన్యాసిరావు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.
- పెదనాగమయ్యపాలెం పంచాయతీలో సర్పంచ్ బొడ్డు సత్తెమ్మ ఆధ్వర్యంలో మహిళలు గ్రామ సచివాలయం వద్ద సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని కొనియాడారు. కార్యక్రమంలో తోట ఎల్లారావు తదితరులు పాల్గొన్నారు.



పెదనాగమయ్యపాలెంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సర్పంచ్ సత్తెమ్మ తదితరులు

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రశాంతి

మధురవాడ: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం అని మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రశాంతి అన్నారు. లింగ నిర్ధారణ వివరాలు వెల్లడించిన వారు, కోరిన వారు, ప్రోత్సహించిన వారు కూడా శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. ఏఎన్ఎమ్, ఇతర వైద్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులకు బేటీ బచావో, బేటీ పడావో, గర్భధారణ, పూర్వ పిండ నిర్ధారణ వ్యతిరేఖ చట్టం (పీసీపీఎన్‌డీటి ఏక్ట్)పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధారణ చేసే వారు మూడేళ్ల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే వైద్యులకు మూడేళ్ల జైలు శిక్ష విధించడంతో పాటు వైద్య మండలి డాక్టర్ పట్టాను ఐదేళ్ల నిలిపి వేస్తుందని చెప్పారు. రెండోసారి చట్టాన్ని ఉల్లంఘిస్తే ఐదేళ్ల జైలు శిక్షతోపాటు వైద్యపట్టా శాశ్వతంగా రద్దు చేస్తారని చెప్పారు. చట్టాన్ని అతిక్రమించిన వారి వివరాలు 104 లేదా 102 టోల్ ఫ్రీ నంబరుకు తెలియజేయాలని కోరారు. 21 సంవత్సరాలు దాటిన తర్వాత మాత్రమే ఆడ పిల్లలు పెళ్లి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మి, సూపర్‌వైజర్ జ్యోతి పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 30 నాటికి లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు



దబ్బందలో టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న జమ్మాన ప్రసన్నకుమార్

తగరపువలస: ఆనందపురం మండలం దబ్బందలో నిర్మిస్తున్న 1920 గృహ సముదాయాలను పూర్తి చేసి లబ్ధిదారులకు ఏప్రిల్ 30 నాటికి అందించాలని కాంట్రాక్ట్ ఏజెన్సీని రాష్ట్ర టీడీసీవో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ ఆదేశించారు. శనివారం ఆయన ఇంజినీరింగ్, జీవీఎంసీ, యూసీడీ, కాంట్రాక్ట్ అధికారులతో కలిసి దబ్బందలో చేపడుతున్న టిడ్కో ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలపై అడిగి తెలుసుకున్నారు. అపార్ట్‌మెంట్ల నిర్వహణ, అసోసియేషన్, పారిశుధ్యం నిర్వహణ, మౌలిక వసతుల కల్పనపై తెలుసుకున్నారు. సొంత ఇల్లు లేని పేదవారికి ఆస్తిని, గౌరవాన్ని, హోదాను ఇవ్వడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. ఆయనవెంట టిడ్కో ఎస్ఈ డి.నరసింహమూర్తి, ఈఈ సుధాకర్, డీఈ ఉమా మహేశ్వరి తదితరులు ఉన్నారు.

నేలకొరిగిన మొక్కజొన్న పంట పరిశీలన



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి, సిబ్బంది

పద్మనాభం: వర్షాలకు నెలకొరిగిన మొక్కజొన్న పంట నష్టం అంచనా వేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి అధికారులను ఆదేశించారు. మండలంలోని కృష్ణాపురం, పాండ్రంగి, గంధవరం గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి వర్షాలకు నెలకొరిగిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వీఏవో, వీఆర్వోలు కలిసి సంయుక్తంగా పంట నష్టాన్ని అంచనా వేయాలని సూచించారు. పంట నష్టపోయిన రైతుల జాబితాను మండల వ్యవసాయ శాఖ అధికారి, తహసీల్దార్ సంతకాలతో తమకు అందజేయాలని కోరారు. 33 శాతం పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందుతుందని తెలిపారు. ఆయనవెంట భీమునిపట్నం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయప్రసాద్, ఎంపీఈవో శ్రీనివాస్ ఉన్నారు.

పట్టుదలతో లక్ష్య సాధన

ఆనందపురం : అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే పట్టుదలతో ముందుకు వెళ్లాలని వృక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాకర సురేష్ సూచించారు. మండలంలోని బోయిపాలెం ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థుల కెరీర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యసనాలకు బానిస కాకుండా చదువుపై దృష్టి సారించాలని కోరారు. జీవితంలో స్థిర పడడానికి పదో తరగతి తొలి మెట్టు అని... ఉత్తమ ఫలితాలు సాధిస్తేనే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందన్నారు. క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని, అప్పుడే నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోగలరని చెప్పారు. మహిళా చట్టాలు, సాధికారిత, నైపుణ్యాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. హెచ్ఎం వెంకటేశ్వరరావు, పాఠశాల కమిటీ చైర్మన్ జామి రాణి, పిల్లి సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశీలు వసూలుకు వేలంపాట రేపు

భీమునిపట్నం: భీమిలి జోన్ పరిధిలోని భీమిలి, తగరపువలస ప్రాంతాల్లోని రోడ్ల మార్జిన్, మార్కెట్లలో ఆశీలు వసూలుకు వేలంపాట జోనల్ కార్యాలయం వద్ద సోమవారం జరుగుతుందని జెడ్సీ బొడ్డేపల్లి రాము తెలిపారు. భీమిలిలోని పెద్దబజారు లాల్‌బహదూర్ మార్కెట్, చిన్నబజారు కలిగొట్ల సూర్యనారాయణనాయుడు మార్కెట్‌లో ఆశీలు వసూలు చేయడానికి సంవత్సరంపాటు అవకాశం కల్పిస్తారని తెలిపారు. అలాగే తగరపువలస, చిట్టివలస రోడ్డు మార్జిన్‌లో ఆశీలు వసూలు చేసుకోవడానికి వేలం నిర్వహించనున్నామని, ఆసక్తి గల వారు సోమవారం ఉదయం 11గంటలకు పాల్గొనవచ్చని జెడ్సీ తెలిపారు.

ఆనందపురం విద్యార్థినికి ఎన్ఎంఎం స్కాలర్‌షిప్



విద్యార్థినికి మంజూరుపత్రం, మెమెంటో అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఆనందపురం : స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎంపికైనట్టు హెచ్ఎం శ్రీనివాసరావు తెలిపారు. ఎనిమిదో తరగతి చదువుతున్న బంటుబిల్లి సంయుక్త పరీక్షకు హాజరై జనరల్ కేటగిరీలో ప్రోత్సాహక స్కాలర్‌షిప్ పొందడానికి అర్హత సాధించింది. ఈ మేరకు ఆమెకు కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యాశాఖ ఐదేళ్లపాటు ఏడాదికి రూ.12వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తారు. ఈ మేరకు విద్యార్థినిని ఉపాధ్యాయులు వెన్ని భాస్కరరావు తదితరులు శనివారం అభినందించి మంజూరుపత్రాన్ని అందజేశారు.

కొమ్మాది రోడ్డులో గొయ్యితో అవస్థలు



కొమ్మాది మాస్టర్ ప్లాన్ రోడ్డులో అసంపూర్తిగా పూడ్చిన గొయ్యి

మధురవాడ: అధికార యంత్రాంగం చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన మాస్టర్ ప్లాన్ రోడ్లు కూడా నరకప్రాయంగా మారుతున్నాయి. కొమ్మాది మాస్టర్ ప్లాన్ రోడ్డులో జీసీసీ లే అవుట్ జంక్షన్ వద్ద తాగునీటి పైపు లైన్ మరమ్మతుల కోసం ఇటీవల పెద్ద గొయ్యి తవ్వారు. తర్వాత అంపూర్తిగా పూడ్చి వదిలేశారు. దీంతో ఇక్కడ వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పూర్తి స్థాయిలో రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతులు



మధురవాడలో జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మధురవాడ: జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతులు చురుగ్గా సాగుతున్నాయి. గత కొంత కాలంగా లైట్లు వెలగకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడడమే కాకుండా తరచూ ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు మరమ్మతులు చేపడుతూ పాడైపోయిన వాటి స్థానంలో కొత్త లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వాహనదారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తగరపువలస: భీమిలి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు ఏప్రిల్ 3న సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని పీవో ఎం.శ్రీదేవి సూచించారు. స్థానికంగా నివసిస్తూ 10వ తరగతి ఉత్తీర్ణులై, 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు గల మహిళలు అర్హులని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు నివాస, కుల, విద్యార్హత, వివాహం మొదలైన ధ్రువీకరణ పత్రాలను అటెస్టేషన్ చేయించి భీమిలి ప్రాజెక్ట్ కార్యాలయంలో నేరుగా లేదా పోస్టల్ ద్వారా అందించాలని సూచించారు.

కార్యకర్తల ఖాళీల వివరాలు ఇవీ : బోని (బీసీ ఏ), పాత మూలకుద్దు (ఎస్టీ), మజ్జివలస - 1 (ఎస్సీ), శొంఠ్యాం - 1 (ఎస్టీ).

ఆయాల ఖాళీల వివరాలు ఇవీ

కురపల్లి (బీసీ సీ), పిట్టావారి గుట్ట (ఎస్సీ), గెద్దపేట (ఎస్టీ), పాతపాలెం (ఎస్టీ), విజయరాంపురం (ఎస్టీ), కంచేరుపాలెం (ఎస్టీ), దిబ్బమీదపాలెం (ఎస్సీ), వలందపేట (ఎస్సీ), సంగివలస కాలనీ (ఎస్సీ), చిప్పాడ - 2 (ఎస్సీ), రామనేనిపేట (ఎస్సీ), గొట్టుపల్లి - 1 (బీసీ ఏ), ముకుందపురం (హెచ్‌హెచ్), వెల్లంకి (ఓహెచ్), పుక్కళ్లపాలెం (ఓహెచ్), పాత మూలకుద్దు(వీహెచ్), శింగనబంద(హెచ్‌హెచ్).

మాస్టర్ ప్లాన్ రోడ్డుకు టీడీఆర్ గ్రహణం

- మధ్యలో నిలిచిపోయిన రేవళ్లపాలెం 80 అడుగుల రోడ్డు పనులు
- పరిహారం కోసం 33 కుటుంబాల ఎదురుచూపు
- స్థలాలు ఇస్తామని ఊరించి చేతులెత్తేసిన గత పాలకులు



వర్షం కురిస్తే రేవళ్లపాలెంలో రోడ్డు పరిస్థితి ఇదీ

మధురవాడ: మాస్టర్ ప్లాన్ రోడ్డు స్థానిక నివాసుల పాలిట శాపంగా మారింది. ఇటు రోడ్డు నిర్మాణ పనులు సాగక... అటు ఉంటున్న ఇళ్లకు మరమ్మతులు చేయించుకోలేక... అవసరాల కోసం అమ్ముకుందామంటే అదీ చేసుకోలేక పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇదీ జీవీఎంసీ జోన్ - 2 పరిధి 6వ వార్డులోని రేవళ్లపాలెం గ్రామానికి చెందిన 33 కుటుంబాల పరిస్థితి. మధురవాడ జాతీయ రహదారి నుంచి రేవళ్లపాలెం, నవోదయ మీదుగా కొమ్మాది మాస్టర్ ప్లాన్ రోడ్డును కలుపుతూ సుమారు కిలో మీటరున్నర మేర 80 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. 2014లో పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా 2015లో డీపీఆర్ సిద్ధం చేసి 2016 నుంచి పనులు ప్రారంభించారు. ఇక్కడ ఆస్తులు పోగొట్టుకుంటున్న వారికి పరిహారం అందకపోవడంతో కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో అప్పటి నుంచి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పనులు నిలిచిపోయాయి. గత పాలకులు రేవళ్లపాలెం గ్రామంలో ఆస్తులు కోల్పోయిన వారికి కే2 కాలనీ సమీపంలో ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి లే అవుట్ సిద్ధం చేశారు. కానీ ఉన్నతాధికారుల నుంచి అనుమతి రాకపోవడంతో ఊరించి గత పాలకులు చేతులెత్తేశారు. దీంతో ఈ సమస్య ఎటూ తేలకుండా మధ్యలో ఉండిపోయింది.

ఏళ్ల తరబడి అవస్థలే

ఈ రోడ్డు నిర్మాణం వల్ల ప్రత్యక్షంగా 22 మంది ఆస్తులు కోల్పోతుండగా పరోక్షంగా మరో 11 మంది కలిపి 33 కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. వీరికి ఏళ్ల తరబడి పరిహారం అందలేదు. ఇక్కడ ఉన్న ఇళ్లు చాలా వరకు శిథిల స్థితిలో ఉన్నాయి. రోడ్డు నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయి. కాల్వలు కూడా ధ్వంసమైపోయాయి. దీంతో వీరు ఇళ్లల్లో ఉండలేక... వేరేచోటకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

పరిహారం ఇవ్వడం లేదు



రోడ్డు నిర్మాణంలో మా ఇళ్లు పోతే... పరిహారంతోపాటు ఇంటి స్థలం కూడా ఇస్తామని అధికారులు ఆరేళ్ల కిందట చెప్పారు. ఇళ్లు ఈ రోజు తీసేస్తారు... రేపు తీసేస్తారని రోజూ ఎవ్వరో ఒక్కరు చెబుతున్నా కార్యరూపం దాల్చలేదు. మా పరిస్థితి చాలా ఇబ్బందిగా ఉంది. టీడీఆర్ ఇచ్చేయమన్నా పట్టించుకునే వారు లేరు.

– పిళ్లా.రాము, గృహిణి

దిక్కుతోచని పరిస్థితి



మా ఇల్లు రోడ్డు నిర్మాణంలో పోతుందని ఆరేళ్ల క్రితం చెప్పారు. అప్పటి నుంచి ఎప్పుడు తీసేస్తారో, ఏమైపోతుందోనని దినదినగండంగా ఉంది. మరమ్మతులు చేయించుకుందామంటే ఎప్పుడు రోడ్డు నిర్మిస్తారో తెలియడం లేదు. మరోవైపు స్లాబు ఊడిపోయి పెచ్చులు రాలుతున్నాయి. అన్ని ఇళ్ల పరిస్థితీ ఇదే. ఇంట్లో ఉండలేక వాకిట్లోనే జీవనం సాగిస్తున్నాం.

– బెవర అన్నపూర్ణ, స్థానికురాలు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణం కారణంగా రేవళ్లపాలెం గ్రామకంఠంలో ఉన్న 22 ఇళ్లు పోతున్నాయి. వీరికి నిబంధనల మేరకు పరిహారం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. వీరితోపాటు మరో 11మంది పరిహారం అడుగుతున్నారు. పైగా ఇక్కడ పోతున్న భూమికి ప్రత్యామ్నాయంగా ఇంటి స్థలాలు ఇవ్వమని 33 మంది డిమాండ్ చేస్తున్నారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వీలైనంత తొందరలో పరిష్కరిస్తాం.

– సీహెచ్.రఘునాథరావు, ఏసీపీ, జీవీఎంసీ జోన్ – 2.

కారును ఈడ్చుకుపోయిన టిప్పర్



కారును డివైడర్‌పైకి ఈడ్చుకుపోయిన టిప్పర్

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం భారీ ప్రమాదం తప్పింది. విశాఖ నుంచి శ్రీకాకుళం కారులో వెళ్తున్న యువకులు ఒడిశా దాబా వద్ద జాతీయ రహదారిపై భోజనానికి ఆగారు. ఇంతలో వెనుక నుంచి ఖాళీగా వేగంగా వచ్చిన టిప్పర్ ఆగి ఉన్న కారును కొంత దూరం ఈడ్చుకుపోవడంతో ఎడమభాగం డివైడర్‌పైకి చేరిపోయింది. స్థానికులు కేకలు వేసి వెళ్లిపోతున్న టిప్పర్‌ను అడ్డుకున్నారు. ఈ ప్రమాద సమయంలో కారులో ఎవరూ లేకపోవడంతోపాటు స్థానికులు అడ్డుకోవడంతో ప్రాణనష్టం తప్పిపోయింది. కారు కుడివైపు రెండు డోర్లు నుజ్జయిపోయాయి. ఝార్కండ్‌కు చెందిన టిప్పర్ డ్రైవర్ రషీద్ నిర్లక్ష్యంగా వాహనం నడిపాడని శ్రీకాకుళం జిల్లా పెదపాడుకు చెందిన కారు డ్రైవర్ ఎం.నాగరాజు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

స్పీడ్ బ్రేకర్లకు జీబ్రాలైన్లు



జీరుపేట కార్నర్ వద్ద స్పీడ్‌బ్రేకర్‌కు జీబ్రాలైన్లు వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: ప్రమాదాల నివారణకు భీమిలి రోడ్డులోని జీరుపేట కార్నర్ వద్ద స్పీడ్‌బ్రేకర్‌కు జీవీఎంసీ రెండో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం సాయంత్రం జీబ్రాలైన్లు వేశారు. ఇటీవల తగరపువలస - భీమిలి ఆర్అండ్‌బీ రహదారికి మరమ్మతులు చేపట్టారు. అందులో భాగంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్న జీరుపేట కూడలి వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుల అభ్యర్థన మేరకు స్పీడ్‌బ్రేకర్లు వేశారు. చీకటి వేళ ఇక్కడ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున చిల్లపేట, జీరుపేట గ్రామాలకు చెందిన నాయకులు చిల్ల బాబయ్యరెడ్డి, జీరు వెంకటరెడ్డి, చిల్ల గణేష్‌రెడ్డి సహకారంతో పసుపు, తెలుపు రంగులతో జీబ్రా లైన్లు వేశారు.

వాహనాల వేలం రేపు

భీమునిపట్నం: ఇక్కడి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) స్టేషన్ వద్ద సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు వాహనాలు వేలం వేస్తామని సీఐ బి.రామకృష్ణ తెలిపారు. ఆరు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో వేలం వేస్తామని, ఆసక్తి గల వారు పాల్గొనవచ్చని తెలిపారు.

బీచ్‌లో వ్యర్థాల తొలగింపు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో ఎండాడకు చెందిన అథ్లెటిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తీరంలోని ప్లాస్టిక్ సంచులు, ఇతర వ్యర్థాలను తొలగించారు. అదేవిధంగా ప్లాస్టిక్ వాడకం వల్ల అనర్థాలను ఇక్కడకు వచ్చిన పర్యాటకులకు అసోసియేషన్ సభ్యులు వైకుంఠరావు, రాజేశ్వరరెడ్డి వివరించారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

తగరపువలస: చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులకు స్థానిక వస్త్ర వ్యాపారి దుర్గా ప్రసాద్ పరీక్షా మెటీరియల్ శనివారం పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ రోజామణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం వసతులు కల్పించిందని కొనియాడారు. పరీక్షల ఫలితాలు కూడా అదే స్థాయిలో తీసుకురావాలని విద్యార్థినులను కోరారు. ఉపాధ్యాయులు విజయరాణి, వాడ్రా వసుంధర, భాగ్యవతి, పీవీ లక్ష్మి, సంతోషి, సత్యవతి, సుమతిబాయి తదితరులు పాల్గొన్నారు.

17 మంది పేకాటరాయుళ్లకు జైలు

పద్మనాభం: మండలంలోని మూడు గ్రామాల్లో మూడు పేకాట కేసులకు సంబంధించి 17 మందికి ఐదు రోజులు సాధారణ జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.300 జరిమానా విధిస్తూ భీమునిపట్నం 14వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ పి.నాగేశ్వరరావు శనివారం తీర్పు చెప్పినట్టు ఎస్ఐ భరత్‌కుమార్‌రాజు తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. 2022లో నమోదు చేసిన రెండు కేసులు, 2023లో నమోదు చేసి ఒక కేసులో ఐనాడకు చెందిన ఐదుగురికి, రేవిడి వెంకటాపురానికి చెందిన ఎనిమిది మంది, మద్ది గ్రామానికి చెందిన నలుగురికి జైలు శిక్ష, జరిమానా విధించినట్టు ఎస్ఐ తెలిపారు.